సాక్షి
పార్వతీపురం మన్యం
సోమవారం । 25 । డిసెంబర్ । 2023



డిజిటల్ చదువుల వెం'బడి'

కంప్యూటర్ విద్య కేవలం డబ్బున్నోళ్లకు మాత్రమే కాదు.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేరువచేసింది. - 8లో



టీబీపై టీకా అస్త్రం

ఒకరి నుంచి మరొకరికి అతి త్వరగా వ్యాప్తి చెందే వ్యాధి క్షయ (టీబీ). క్షయ రోగి తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు వచ్చే తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందుతుంది. - 8లో



ఆటల పండగపై అవగాహన

ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలను పండగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

అన్నప్రసాదం స్వీకరణ



శ్రీకాళహస్తిలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, రోజమ్మ దంపతులు

సాలూరు: రాష్ట్ర ప్రజలు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సుఖసంతోషాలతో ఉండాలని దేవుడిని ప్రార్థించినట్లు డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర 'సాక్షి'కి ఫోన్‌లో తెలిపారు. తిరుపతి, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాలను శని, ఆదివారాల్లో దర్శించారు. శ్రీకాళహస్తిలోని అన్నదాన సత్రంలో సామాన్య భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

పుష్కలంగా సాగునీరు



కుడి కాలువ నుంచి ప్రవహిస్తున్న సాగునీరు

మెంటాడ: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఆండ్ర జలాశయం పూర్తిస్థాయిలో నిండింది. రబీలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న, పత్తి, వేరుశనగ తదితర పంటలకు అవసరమైన నీటిని ప్రాజెక్టు అధికారులు విడుదలచేశారు. కాలువలు నిండుగా ప్రవహిస్తుండడంతో రైతులు సంతోషపడుతున్నారు. నాలుగేళ్లుగా వర్షాలు ఆశానకంగా కురుస్తుండడంతో సాగునీటి సమస్య తలెత్తలేదన్నారు.

చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: క్రిస్మస్ పండగను పురస్కరించుకుని నర్సిపురం గ్రామంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నిరుపేదలకు ఆర్థిక సాయం అందజేశారు. నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ బంగారమ్మ, పీఏసీఎస్ చైర్మన్ కె.సత్యనారాయణ, పార్టీ జనరల్ సెక్రటరీ వి.గురురాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు తెర్లి రామస్వామి, సెట్టి వెంకటరమణ, రెడ్డి అప్పలస్వామి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

1.48 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్



కర్మాగారానికి ట్రాక్టర్‌తో చెరకు తరలింపు

రేగిడి: మండలంలోని సంకిలి వద్ద ఉన్న ఈఐడీ చక్కెర కర్మాగారంలో ఇంతవరకు 1.48 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ చేసినట్టు కర్మాగారం సీనియర్ అసోసియేటివ్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభిరామిరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ ఏడాది 4.10 లక్షల మెట్రిక్ టన్నుల చెరకును క్రషింగ్ చేయాలన్నది లక్ష్యంగా చేసుకున్నామని వెల్లడించారు. ప్రతిరోజు 3,500 టన్నుల చెరకును గానుగ ఆడుతున్నామన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి చెరకును కర్మాగారానికి తరలించే రైతులకు అందుబాటులో ఉండేలా కూలీలను ఆయా ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచామని తెలిపారు. చెరకు కర్మాగారానికి వచ్చిన రెండు నెలల్లోనే నగదు చెల్లింపులు చేస్తున్నామన్నారు.

క్రీస్తుబోధనలు ఆచరణీయం



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: కరుణ, క్షమ, ఆనందంతో నిండిన ప్రేమను తోటివారికి అందించాలనే ఏసుక్రీస్తు బోధనలు మానవాళిని ప్రభావితం చేశాయని, ఇవి ఆచరణీయమైనవని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. క్రైస్తవులందరికీ ఆదివారం ఓ ప్రకటనలో క్రిస్మస్‌ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పర్వదినాన్ని సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

ప్రగతిబాటలో ఆర్టీసీ



- ప్రయాణికులకు సురక్షిత ప్రయాణ సేవలు
- కార్గోసేవలతో ఆదాయార్జన
- భక్తులకు అనువుగా తీర్థయాత్రల ట్రిప్పులు
- ఇంధన పొదుపుపై ప్రత్యేక శ్రద్ధ. డ్రైవర్లకు ప్రోత్సాహకాలు
- పార్వతీపురం మన్యం జిల్లాలోని 3 డిపోల పరిధిలో 232 బస్సు సర్వీసులు
- రోజుకు 1734 ట్రిప్పులు
- బస్టాండ్‌లలోని 160 స్టాల్స్‌తో ప్రతినెల రూ.లక్షల ఆదాయం
- జిల్లాలో నెలసరి ఆదాయం రూ.9.48 కోట్లు



పార్వతీపురం టౌన్: సురక్షిత, సౌకర్యవంతమైన ప్రయాణ సేవలు... వేగవంతమైన వస్తురవాణా సేవలతో ఆర్టీసీ ముందుకు సాగుతోంది. ప్రజలు, ప్రయాణికుల ఆదరాభిమానాలను చూరగొంటూ లాభాల బాటలో పయనిస్తోంది. మారుమూల గ్రామాలకు సైతం బస్సులు నడుపుతూ గతానికి భిన్నంగా ఆదాయాన్ని ఆర్జిస్తోంది. ప్రణాళికాబద్ధమైన సేవలతో ప్రజలకు చేరువవుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో 3 ఆర్టీసీ డిపోలు ఉండగా, 232 బస్సులు రోజూ 1734 ట్రిప్పులు తిరుగుతున్నాయి. ఆయా సర్వీసుల ద్వారా రోజుకు సుమారు 60వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. దీని ద్వారా ఆర్టీసీకి రోజూ రూ.33.16 లక్షల ఆదాయం వస్తోంది. జీతాలు, నిర్వహణ, ఇంధనం కోసం ఎక్కువగా వెచ్చించాల్సి రావడంతో గతంలో నష్టాల్లో కూరుకుపోయింది. అయితే, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. ఆర్టీసీ ఉద్యోగులు కూడా సంస్థ ప్రగతికి తమవంతు కృషిచేస్తున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక సర్వీసులు తిప్పుతూ ఆదాయం పెంచుకుంటున్నారు. ప్రజాసేవ, సురక్షిత ప్రయాణం, ఆదా, ఆదాయం అనే నాలుగు చక్రాలతో ఆర్టీసీని లాభాల బాట పట్టించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఇంధన పొదుపే లక్ష్యంగా..

ఇంధన పొదుపే లక్ష్యంగా ప్రభుత్వం ఏటా పొదుపు వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఇంధనం పొదుపుచేసే డ్రైవర్లకు ప్రోత్సాహకం అందిస్తోంది. ఇంధన పొదుపుపై డ్రైవర్లకు శిక్షణ ఇప్పిస్తోంది.

రిటైల్‌గా డీజిల్ కొనుగోలుతో మరింత ఆదా...

జిల్లాలోని 3 డిపోల్లోని 232 బస్సులు రోజూ 96,267 కిలోమీటర్లు తిరుగుతున్నాయి. దీనికోసం 19వేల నుంచి 20 వేల లీటర్లు అవసరమవుతోంది. డీజిల్ బల్క్ కొనుగోలుపై కేంద్రం సుంకం అధికంగా విధించడంతో ఆర్టీసీపై భారంపడేది. బల్క్ బయ్యర్ వద్ద లీటర్ డీజిల్ ధర రూ.100 ఉండగా, రిటైలర్ వద్ద రూ.93.55కే లభిస్తోంది. దీంతో సంస్థ ఉన్నతాధికారులు రిటైల్ కొనుగోలుపై దృష్టి సారించారు. బల్క్ బయ్యర్ ద్వారా డీజిల్ కొనుగోలు చేస్తే రోజూ రూ.23.94 లక్షల వరకు వెచ్చించాల్సి వచ్చేది. ప్రస్తుతం రిటైల్‌గా డీజిల్ కొనుగోలు చేస్తుండడంతో రూ.22 లక్షలే అవుతోంది. దీంతో సంస్థకు రోజుకు సుమారు 2లక్షల వరకు ఆదా వుతోంది.

బస్టాండ్లలో స్టాల్స్ ద్వారా రూ.10.27 లక్షల ఆదాయం

జిల్లా వ్యాప్తంగా 3 ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రస్తుతం 160 స్టాల్స్ ఉన్నాయి. వీటి టెండర్ ద్వారా అద్దెకు, లీజుకు ఇస్తుంటారు. ప్రతి నెల ఈ షాపుల ద్వారా రూ.10.27 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ఖాళీ స్థలాలనూ ఆదాయ వనరులగా మార్చుకుంటున్నారు. బస్టాండ్లలో ప్రకటన బోర్డుల ద్వారా రాబడి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో ఆర్టీసీ నెలసరి ఆదాయం ఇలా..

డిపో	నెలసరి ఆదాయం రూ.కోట్లలో
పార్వతీపురం	3.64
పాలకొండ	3.16
సాలూరు	2.68
మొత్తం	9.48

జిల్లాలోని మూడు డిపోల పరిధిలో ఆర్టీసీ సేవలు ఇలా

బస్సులు	232
సర్వీసులు (ట్రిప్పులు)	1734
రోజుకు సగటున ప్రయాణించేవారు	62,434
ప్రయాణికుల ద్వారా వచ్చే ఆదాయం	రూ. 33.16 లక్షలు
నెలకు స్టాల్స్ ద్వారా వచ్చే ఆదాయం	రూ.10.27 లక్షలు
రోజుకు పార్సిల్ బుకింగ్‌లు సగటున	157
రోజుకు పార్సిల్ ద్వారా వచ్చే ఆదాయం	రూ.12,030

కార్గో సేవలు విస్తృతం

జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ 9 కార్గో బుకింగ్ కేంద్రాను నడుపుతోంది. ఈ కేంద్రాల ద్వారా రోజుకు సరాసరిన 157 బుకింగ్‌లు జరుగుతున్నాయి. దీనికి ఆర్టీసీకి రూ.12,030లు ఆదాయం వస్తోంది. బల్క్ బుకింగ్‌లు ఉంటే వినియోగదారుల వద్దకే సిబ్బంది వెళ్తున్నారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండడంతో కార్గో సేవలను మరింత విస్తృతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొత్తగా బుకింగ్ కేంద్రాలకు అనుమతులు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. తద్వారా ఆదాయం పెంచుకునేలా ముందుకు సాగుతున్నారు.



పార్వతీపురం ఆర్టీసీ డిపోలో కార్గోకౌంటర్

ఆర్టీసీకి ఉద్యోగులే వెన్నెముక



ఆర్టీసీకి ఉద్యోగులే వెన్నెముక. ఉద్యోగులు, కార్మికులతో సమష్టిగా సాగుతూ సంస్థను లాభాల బాట పట్టించేందుకు శ్రమిస్తున్నాం. ఆదాయవనరులూ పెంచుకొంటున్నాం. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఇంధన పొదుపు, ఇతరత్రా వాటిపై దృష్టి సారించాం. ఆదాయ అన్వేషణలో ముందుకు వెళ్తున్నాం.

– టి.వి.ఎస్.సుధాకర్, జిల్లా ప్రజా రవాణా అధికారి, పార్వతీపురం మన్యం

క్రిస్మస్ శోభ



ఆర్‌సీఎం చర్చిలో ఏసు జనన ఘట్టం

క్రిస్మస్ వేడుకలకు జిల్లాలోని క్రీస్తు నిలయాలు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్నాయి. ప్రార్థనలు, భక్తిగీతాల ఆరాధనకు వీలుగా చర్చి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. వందల ఏళ్లుగా క్రీస్తు శాంతి సందేశాలు వినిపిస్తున్న పార్వతీపురంలోని చర్చిలను శోభయమానంగా తీర్చిదిద్దారు. కొన్ని చర్చిల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచే ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. క్రీస్తు సందేశాలను పెద్దలు వినిపించారు. – పార్వతీపురంటౌన్



విద్యుత్‌కాంతులతో ముస్తాబైన లూథరన్ చర్చి



పార్వతీపురంలోని లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఏసు ఆరాధకులు

క్రీడాప్రతిభను వెలికితీసేందుకే..

ఆడుదాం ఆంధ్రా పోటీలు



ఆడుదాం-ఆంధ్రా క్రీడా సంబరం అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్

- పార్వతీపురంలో క్రీడా పోటీల అవగాహన ర్యాలీని ప్రారంభించిన జేసీ

పార్వతీపురంటౌన్: క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా ఆడుదాం-ఆంధ్రా పోటీలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఆర్‌సీఎం స్కూల్ వరకు ఆదివారం నిర్వహించిన ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీల అవగాహన ర్యాలీని జేసీ ప్రారంభించారు. క్రీడాకారుల్లో ఉత్తేజాన్ని నింపారు. ఈ నెల 26వ తేదీ నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు 47 రోజుల పాటు సాగే క్రీడాసంబరం క్రీడల్లో రాణించేందుకు చక్కని వేదికగా పేర్కొన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో పోటీల్లో తలపడి క్రీడాప్రతిభను ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో అర్జున అవార్డు గ్రహీత ఎస్.జయరాం, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా హెల్త్ ప్రొగ్రాం అధికారి డా.టి.జగన్మోహనరావు, మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు, ఎంఈఓ ప్రసాదరావు, వివిధ పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు వరప్రసాద్, సీహెచ్ రత్నాకర్, సి.శ్రీనివాసరావు, శ్రీధర్, క్రీడా శిక్షకులు గణేష్, రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. క్రీడాకారులతో జేసీ కాసేపు కబడ్డీ ఆడి ఉత్సాహపరిచారు.



విద్యార్థులతో కబడ్డీ ఆడుతున్న జాయింట్ కలెక్టర్

రైల్వే ట్రాక్ దాటిన గజరాజులు

కొమరాడ: ఇటీవల దుగ్గి, కళ్లికోట, గుణానపురం పరిసరాల్లో సంచరించిన ఏడు ఏనుగుల గుంపు ఆదివారం రైల్వే ట్రాక్ దాటి ఆర్తాం కొండ పరిసరాల్లోకి చేరుకుంది. కుమ్మరిగుంట, స్వామినాయుడువలస పంట పొలాల్లో సంచరిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. టమాటా, జొన్న, అరటి, తదితర పంటలను నాశనం చేస్తున్నాయని చెబుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల గుంపును తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

రేగిడి చేరిన మరో ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని తివ్వాకొండ పరిసరాల్లోకి కొత్తగా ఏనుగుల గుంపు చేరింది. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో సంచరించే గజరాజులు తిత్తిరి రూటులో రేగిడికి చేరాయి. ఇప్పటికే వరికోతలు పూర్తికావడంతో ఆహారం దొరకక ఆదివాసీలు సాగుచేస్తున్న అరటి, కూరగాయల తోటలను నాశనం చేస్తున్నాయని నల్లరాయిగూడ సర్పంచ్ గోయింతి ప్రసాద్, బిడ్డికి నూకయ్య ఆందోళన వ్యక్తం చేశారు.



కొమరాడ: రైల్వేట్రాక్ దాటుతున్న ఏడు గజరాజుల గుంపు

మార్కెట్‌కు మన్యం కంది

- జిల్లాలో 415 ఎకరాల్లో సాగు
- ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్ల దిగుబడి
- ఆర్గానిక్ పద్ధతిలో సాగు
- విక్రయానికి సిద్ధమవుతున్న గిరిజన రైతాంగం



కందికాయలు



విరగ్గాసిన కందిచేను

సీతంపేట: మన్యంలో ఈ ఏడాది కందిసాగు గిరిజన రైతులకు కలిసొచ్చింది. అధికదిగుబడి వస్తుండడంతో ఆనందపడుతున్నారు. గతేడాది అకాల వర్షాలతో పంటకు నష్టంవాటిల్లింది. ఈ సంవత్సరం వాతావరణం అనుకూలించడంతో పంట కలిసొచ్చిందని రైతులు చెబుతున్నారు. కొండికొత్తల పండగ పూర్తయిన గ్రామాల్లో పంట విక్రయాలు ప్రారంభించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 15 మండలాలకు 10 మండలాల్లో 415 ఎకరాల్లో కందిపంట సాగులో ఉంది. ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల వరకు దిగుబడివస్తోంది. ఎకరా కంది పంట వేసే రైతుకు ఖర్చులుపోను రూ.20వేల నుంచి రూ.25వేల వరకు ఆదాయం సమకూరుతుందని రైతులు చెబుతున్నారు. మన్యంలో జీడి, పసుపు వంటి పంట పొలాల్లో అంతర పంటగా కందిని సాగు చేస్తారు. కొన్నిచోట్ల పోడుభూముల్లో ప్రధాన పంటగా కూడా సాగుచేస్తున్నారు. గిరిజన రైతులకు ఐటీడీఏలు నాణ్యమైన విత్తనాలను సమకూర్చుతున్నాయి. మార్కెట్‌లో కంది పంటకు గిరాకీ ఉండడం రైతులకు కలిసొస్తోంది. గిరిజనుల వద్దనే నాణ్యతను బట్టి కిలో కందులు రూ.65 నుంచి రూ.80 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

పితృదేవతలకు పూజించాకే..

ఈ నెలాఖరు నుంచి జనవరి మొదటి వారం వరకు పంట చేతికందుతుంది. గిరిజన ఆచార సంప్రదాయాల ప్రకారం కందికొత్తల పండగ చేస్తారు. కొండపోడులో సాగుచేసే కందిపంటను కందికొత్తల పండగ తరువాత మాత్రమే తింటారు. విక్రయిస్తారు. ముందుగా పితృదేవతలకు ప్రత్యేక పూజలు చేస్తారు. గిరిజనులు దేవతలుగా భావించే చేతరమ్మ, గొడ్డలమ్మ, కప్పరమ్మను జాకరమ్మదగ్గరకు చేర్చుతారు. గిరిజనలందరూ అక్కడికి చేరి పూజలు చేస్తారు. కొత్తగా చేతికందిన కందిపంటతో వంటకాలు చేసి గిరిజన దేవతలకు నైవేద్యంగా సమర్పిస్తారు. అనంతరం సామూహిక భోజనాలు చేస్తారు.



పొలం గట్లపై కంది పంట

కందిపంట సాగు విస్తీర్ణం ఇలా...

మండలం	ఎకరాలు
సీతంపేట	23.43
జి.ఎల్.పురం	125.92
కురుపాం	269.2
పాలకొండ	17.72
భామిని	1.26
వీరఘట్టం	10.67
సాలూరు	3.9
పాచిపెంట	0.19
మక్కువ	7.89
కొమరాడ	35.02

దిగుబడి పెరిగింది



ఈ సంవత్సరం కంది దిగుబడి పెరిగింది. కొంతమంది రైతులు పొలాలతో పాటు గట్లపైన పంటను సాగుచేశారు. వీటి దిగుబడి గతేడాది కంటే బాగుంది. ఐటీడీఏ పరంగా గిరిజనులుకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తూ సాగును ప్రోత్సహిస్తున్నాం. అవసరమైన చోట అవగాహన సదస్సులు పెడుతున్నాం. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– జి.హరికృష్ణ, ప్రాజెక్టు అగ్రికల్చరల్ ఆఫీసర్, ఐటీడీఏ, సీతంపేట

కొండపోడులో సాగు



ఎక్కువగా కొండపోడు వ్యవసాయంలో కూడా కంది పంటను సాగు చేస్తాం. ఎత్తైన కొండలపై కూడా కంది వేస్తాం. అలాగే, దిగువ పొలాల్లో గట్లపైన పంట పండిస్తాం. కంది పంటకు ధర బాగుంది. అధిక ఆదాయం వస్తుందని ఆశిస్తున్నాం.

– ఎస్.రజిని, కోసిమానుగూడ

క్లుప్తంగా

27న ఉద్యోగ మేళా

చీపురుపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగులకు ఈ నెల 27న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డా.పీవీ కృష్ణాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ఉదయం 10 గంటలకు కళాశాల ఆవరణలో నిర్వహించనున్న జాబ్ మేళాకు హైదరాబాద్‌కు చెందిన అరబిందో ఫార్మా, ఎంఎస్ఎస్ ల్యాబ్స్, న్యూ ల్యాండ్ ల్యాబొరేటరీస్ సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ ఉద్యోగమేళాకు హాజరు కాదలచిన అభ్యర్థులు బీఫార్మా, బీఎస్సీ కెమిస్ట్రీ, బీటెక్, ఇంటర్‌మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ ఉత్తీర్ణత కలిగి కనీసం 26 సంవత్సరాలు ఉండాలని పేర్కొన్నారు. ఇంటర్వ్యూల్లో ఎంపికైన అభ్యర్థులకు ఆర్‌బీఎస్ఎస్ అండ్ ఎఫ్ఎస్‌దాస్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధుల ద్వారా విశాఖపట్నంలో నెల రోజుల పాటు శిక్షణ ఇచ్చిన అనంతరం ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఉద్యోగావకాశాల్లో భాగంగా నెలకు రూ.12,500 నుంచి రూ.20,000 వరకు వేతనాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాల కోసం ఫోన్ 8688156216, 86880880562 నంబర్లకు సంప్రదించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాస్

విజయనగరం టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా జోన్ ఉద్యమాన్ని నిర్వహిస్తామని ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ భవనంలో జోనల్ సర్వసభ్యసమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా ఉద్యమం చేస్తున్నప్పటికీ స్థానిక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నుంచి స్పందన లేకపోవడం విచారకరమన్నారు. కింద ఉన్న డీపీటీఓ ఆదేశాలివ్వలేని పరిస్థితులిలా కొనసాగితే తీవ్రమైన పరిణామాలు ఎదురవుతాయని, రాష్ట్రవ్యాప్తంగా సర్క్యులర్ అమలు జరుగుతూ ఉంటే విజయనగరం జోన్‌లో అమలుపరచకపోవడం శోచనీయమన్నారు. ఈ హెచ్ఎస్ పాత ఆర్టీసీ పద్ధతిలో కొనసాగించాలని, సస్పెన్షన్ పేరిట ట్రాన్స్‌ఫర్ ఇచ్చిన వారిని జోన్ వ్యాప్తంగా తిరిగి సొంత డిపోలకు పంపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పీవీ.మోహన్, జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రదీప్ కుమార్, ఎంవీఆర్.మూర్తి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీజీ.రాఫెల్, బీఎస్.రాములు, జోన్‌లో ఉన్న అన్ని కేటగిరీల నాయకులు పాల్గొన్నారు.

చెరుకుతోటలో అగ్ని ప్రమాదం

పాలకొండ రూరల్: మండలంలోని గోపాలపురం గ్రామంలో సాగులో ఉన్న 50 ఎకరాల చెరుకుతోటల్లో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. గ్రామస్తులు అందించిన సమాచారంతో అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు శకటంతో సహా ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలు తోటను చుట్టుముట్టకుండా అదుపుచేశారు. దీంతో భారీ నష్టం నుంచి రైతులు బయట పడ్డారు. ఈ క్రమంలో ఆదే గ్రామానికి చెందిన సిరిపురపు సత్యనారాయణ, రామలింగం, నారాయణరావు, కృష్ణమూర్తి, కృష్ణతో పాటు ధనుకోటి వెంకరమణలకు చెందిన దాదాపు రెండు ఎకరాల చెరుకు తోట పూర్తిగా దగ్ధమైంది. రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు.

భోగాపురం పోలీస్ స్టేషన్ అప్‌గ్రేడ్

భోగాపురం: భోగాపురం పోలీస్‌స్టేషన్ అప్‌గ్రేడ్ అయింది. ఈ పోలీస్‌స్టేషన్‌లో గతంలో స్టేషన్‌హౌస్ అధికారిగా ఎస్సై వ్యవహరించేవారు. భోగాపురం పోలీస్‌స్టేషన్‌లో సీఐ, ఎస్సై, సిబ్బంది ఉంటారు. ప్రస్తుతం భోగాపురం పోలీస్‌స్టేషన్‌ను మినహాయించి, పూసపాటిరేగ, డెంకాడ, నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్‌లు సర్కిల్ స్టేషన్‌లుగా ఏర్పడ్డాయి. దీంతో ఆదివారం నుంచి భోగాపురం పోలీస్‌స్టేషన్‌కు ఒక సీఐ, సర్కిల్ కార్యాలయానికి ఒక సీఐ ఉంటారు. అయితే భోగాపురం పోలీస్‌స్టేషన్‌కు కొత్త సీఐని నియమించినంతవరకు ప్రస్తుత సర్కిల్ సీఐ బీవీ వెంకటేశ్వరరావు ఇన్‌చార్జ్‌గా వ్యవరించనున్నారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

• రూ.40,160లు స్వాధీనం

డెంకాడ: మండలంలోని మోపాడ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు డెంకాడ ఎస్సై యు.మహేష్ తెలిపారు. పేకాటరాయుళ్ల దగ్గర నుంచి రూ.40,160లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹200

డిజిటల్ చదువుల వెంబడి

- దూసుకు పోతున్న ప్రభుత్వ పాఠశాలలు
- 8వ తరగతి నుంచే విద్యార్థులకు ట్యాబ్‌లు
- ట్యాబ్‌లో విలువైన బైజూస్ కంటెంట్
- బైజూస్ కంటెంట్‌తో కలిపి ఒక్కో ట్యాబ్ ఖరీదు రూ.33 వేలు
- ఈ ఏడాది జిల్లాలో 17,330 మందికి పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(ఫైల్)

చీపురుపల్లి: కంప్యూటర్ విద్య కేవలం డబ్బున్నోళ్లకు మాత్రమే కాదు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా అందిస్తామని ప్రభుత్వం చెప్పడమే కాకుండా చేసి చూపించింది. ఓవైపు తరగతి గదుల్లో డిజిటల్‌గా, మరోవైపు ఇంగ్లీష్ మీడియం బోధనతో బాటు విద్యార్థులకు ఉన్నత పాఠశాల నుంచే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కంప్యూటర్ బోధన ఉండాలనే లక్ష్యంతో ట్యాబ్‌లు అందుబాటులోకి తీసుకొచ్చింది. బైజూస్ యాప్ అందుబాటులోకి వచ్చినా అందులో ఉండే కంటెంట్ కొనుగోలు చేసే ఆర్థిక పరిస్థితి లేని



విద్యార్థులకు పంపిణీ చేస్తున్న ట్యాబ్‌లు

పేద తల్లిదండ్రుల్లో ఎలాంటి బాధ లేకుండా ప్రభుత్వమే బైజూస్ కంటెంట్ కొనుగోలు చేసి ట్యాబ్‌ల్లో పొందుపరిచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తోంది. ప్రస్తుతం పల్లెటూరిలో ఉండే ఎనిమిదవ తరగతి పిల్లాడి చేతిలో ట్యాబ్ కనిపిస్తోంది. అందులో అత్యంత విలువైన సబ్జెక్టులతో కూడిన బైజూస్ కంటెంట్ కూడా ఉంది. దీంతో విద్యార్థులు తమ సబ్జెక్టులకు సంబంధించి ఏ సమయంలోనైనా ఎలాంటి డౌట్స్ అయినా సరే నివృత్తి చేసుకునే ఆస్కారం కలిగింది.

జిల్లాలో 17,330 వేల ట్యాబ్‌లు పంపిణీ..

జిల్లాలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది విద్యాసంవత్సరానికి సంబంధించి 17,330 వేల మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తోంది.

ఒక్కో ట్యాబ్ ఖరీదు రూ.33 వేలు..

ఇదిలా ఉండగా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఒక్కో ట్యాబ్ ఖరీదు రూ.33 వేలు. ఆ లెక్క ప్రకారం జిల్లాలో గత ఏడాది పంపిణీ చేసిన 18 వేల ట్యాబ్‌లు ఖరీదు రూ.59.40 కోట్లు కాగా ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేస్తున్న 17,330 ట్యాబ్‌లకు గాను రూ.57.18 కోట్లు అవుతోంది.

జగన్ మామయ్యకు కృతజ్ఞతలు



నా పేరు ఎస్.సుప్రియ నేను చీపురుపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాను. నాకు గత ఏడాది ప్రభుత్వం ట్యాబ్ ఇచ్చింది. ఆ ట్యాబ్‌లో 8, 9, 10 తరగతులకు సంబంధించిన అన్ని సబ్జెక్టులు ఉన్నాయి. ఎంతో విలువైన బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్ ఇచ్చారు. మాకున్న ఆర్థిక స్తోమత ప్రకారం రూ.33 వేలు వెచ్చించి ట్యాబ్ కొనుగోలు చే సుకోలేం. ఉపాధ్యాయులు బోధించిన తరువాత ఇంటికి వెళ్లి ట్యాబ్‌లో కూడా చూసుకుని డౌట్స్ తీర్చుకుంటున్నాం. ట్యాబ్ మాకు చాలా ఉపయోగకరంగా ఉంది. జగన్ మామయ్యకు థ్యాంక్స్ చెప్పుకోవాలి.

– ఎస్.సుప్రియ, 9వ తరగతి విద్యార్థిని

ట్యాబ్‌లు ఎంతో ఉపయోగకరం



నా పేరు ఎం.రాణి గాయత్రి, నేను చీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాను. సీఎం జగన్ సార్ మాకు ఎంతో ఉపయోగమైన ట్యాబ్‌లు ఇచ్చారు. ఈ ట్యాబ్‌లు కొనుగోలు చేసుకునే ఆర్థిక స్తోమత మాకు లేదు. కానీ బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు ప్రభుత్వం ఇచ్చింది. సబ్జెక్టు పరంగా ఈ ట్యాబ్‌లు ఎంతో ఉపయోగపడుతున్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– ఎం.రాణి గాయత్రి, 9వ తరగతి

ప్రారంభమైన ట్యాబ్‌ల పంపిణీ

జిల్లాలో ఉన్న అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 17,330 వేల మంది ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నాం. ఈ నెల 21 నుంచే అన్ని పాఠశాలల్లో ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం జరుగుతోంది. ఎంతో విలువైన కంటెంట్‌తో ఉన్న ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– లింగేశ్వరరెడ్డి, డీఈఓ, విజయనగరం

ఉల్లాసంగా జిల్లాస్థాయి ఖోఖో పోటీలు

- స్వర్గీయ భగవాన్‌దాస్ మాస్టారుకు ఘనంగా నివాళి



భగవాన్‌దాస్ మాస్టారు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



ఖోఖో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: కబడ్డీ, ఖోఖో పితామహుడు స్వర్గీయ భగవాన్‌దాస్ మాస్టారు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి బాలుర ఖోఖో పోటీలు ఉల్లాసంగా..ఉత్సాహంగా సాగాయి. భగవాన్‌దాస్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 12 జట్లు పాల్గొన్నాయి. పోటీల ప్రారంభోత్సవానికి ముందుగా పాఠశాల ఆవరణలో ఉన్న భగవాన్‌దాస్ మాస్టారు విగ్రహానికి ట్రస్ట్ కార్యదర్శి రంగారావు దొర, జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు పి.చిన్నంనాయుడు, కార్యదర్శి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.గోపాల్, వ్యాయామ అధ్యాపకుడు ఏఎస్ఎం కమలనాభరావు, రిటైర్డ్ కోచ్ రమణమూర్తి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాకౌట్ పద్ధతిలో నిర్వహించిన పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన పోటీల్లో మరుపల్లి జట్టు ప్రథమస్థానం దక్కించుకోగా..కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాల జట్టు ద్వితీయ స్థానం కై వసం చేసుకుంది. తృతీయ స్థానాన్ని ఉమ్మడిగా గరుగుబిల్లి, తోంద్రంగి జట్లు దక్కించుకున్నాయి. పోటీల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నగేష్, కేఏ బాలకృష్ణ, పలువురు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

జాషువాపై చారిత్రక దృష్టితో పరిశోధన



డాక్టర్ కళ్లేపల్లి ఉదయ్‌కిరణ్‌ను సత్కరిస్తున్న విజయభావన సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: జాషువాపై చారిత్రక దృష్టితో పరిశోధన జరగాలని శ్రీకాకుళం డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కళ్లేపల్లి ఉదయ్ కిరణ్ పేర్కొన్నారు. విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక గురజాడ గ్రంథాలయం ఆవరణలో ఆదివారం రాత్రి జాషువా కవితా వైభవంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానవక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ జాషువా గబ్బిలం–ఆంధ్ర చారిత్రక వైభవం అనే విషయంపై మాట్లాడుతూ తనను తాను విశ్వనరుడిగా ప్రకటించుకున్నా, కొందరు మాత్రం సంఘసంస్కరణకు, దళితవాదానికి, దేశభక్తికి మాత్రమే పరిమితం చేశారన్నారు. నేతాజీ–బాపూజీ, గబ్బిలం –క్రీస్తు ఇలా విభిన్న తత్వాలు కలగలిపిన రచనలు ఆయనను విశ్వనరునిగా చూపిస్తాయన్నారు. గబ్బిలం రచనలో హంపి, కవిత్రయం, కొండవీటిరాజులు తదితర చారిత్రక అంశాలు సోదాహరణంగా చూపించారని కొనియాడారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు స్వాగతం పలకగా, దశగ్రంథాల సుబ్రహ్మణ్యం వందన సమర్పణ చేశారు. అనంతరం సమాఖ్య గౌరవ సలహాదారు బీహెచ్‌కే.బాబూజీ సమ్మానకర్తగా వ్యవహరించారు. మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల విద్యార్థులు కోట విజయకుమార్, పెంకి సాయితేజలు కవితాగానం చేశారు. కార్యక్రమంలో మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల అధ్యక్షుడు డాక్టర్ జి.జనార్ధనాయుడు, సభ్యులు భోగరాజు సూర్యలక్ష్మి, బాబూరావు, రాఘవరావు, వారణాసి మూర్తి, గురునాథరావు, సర్వేశ్వరరావు, సోమేశ్వరరావు, హరిచందన్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

టీబీపై టీకా అస్త్రం

- గ్రామాల్లో మొదలైన సర్వే



బీసీజీ వ్యాక్సిన్



గంట్యాడ మండలం పెదవేమలిలో సర్వే చేస్తున్న ఏఎన్ఎం

విజయనగరం ఫోర్ట్: ఒకరి నుంచి మరొకరికి అతి త్వరగా వ్యాప్తి చెందే వ్యాధి క్షయ (టీబీ). క్షయ రోగి తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు వచ్చే తుంపర్ల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందుతుంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి, పొగ తాగేవారికి ఎక్కువగా క్షయ వ్యాధి సోకే ఆస్కారం ఉంది. అదేవిధంగా మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా క్షయ వ్యాధి సోకే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం క్షయ వ్యాధి బారిన పడే వారి సంఖ్యను తగ్గించేందుకు చర్యలు చేపట్టింది. టీకా అస్త్రాన్ని ఉపయోగించి క్షయ వ్యాధికి చెక్ పెట్టనుంది.

సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

క్షయ వ్యాధి బారిన పడే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు ఈనెల 13 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభించారు. వ్యాక్సిన్ వేయడానికి అర్హత ఉన్న వారి వివరాలు ఏఎన్ఎం యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. 60 ఏళ్లు దాటిన వృద్ధులు, పొగతాగేవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, బరువు తక్కువగా ఉన్న వారిని సర్వేలో గుర్తిస్తున్నారు.

సర్వే పూర్తయిన వెంటనే టీకా



ఆన్‌లైన్ సర్వే పూర్తయిన వెంటనే బీసీజీ టీకా వేయడం ప్రారంభిస్తాం. రెండు రోజులుగా సిబ్బంది సర్వే చేస్తున్నారు. టీకా వేయడం వల్ల క్షయ వ్యాధి బారిన పడే వారిని 18 నుంచి 21 శాతం తగ్గించవచ్చు.

– డాక్టర్ కె.రాణి, జిల్లా క్షయ నివారణ అధికారి

ప్రతి ఇంటా సంతోషం నిండాలి

- కలెక్టర్ నాగలక్ష్మి
- జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు



కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: ఈ క్రిస్మస్ పండగ ప్రజలందరి జీవితాల్లో సంతోషం నింపాలని, ప్రతి ఇంటా ఆనందపు కాంతుల వెలుగులు నిండాలని కలెక్టర్ నాగలక్ష్మి అకాంక్షించారు. జిల్లా ప్రజలందరికీ ఆదివారం ఆమె ఒక ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సాటి మానవుల పట్ల ప్రేమ, దయ, కరుణ, క్షమాగుణం చూపడం అనే ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమని పేర్కొన్నారు. ఈలోకానికి మార్గదర్శి అయిన ఏసు ప్రభువు జన్మించిన ఈక్రిస్మస్ పర్వదినం అందరిలో నూతన ఉత్సాహాన్ని నింపాలని, ఆయురారోగ్యాలు సిద్ధించాలని అకాంక్షించారు. శాంతి, సౌఖ్యాలు వర్ధిల్లాలని, ప్రజలంతా సోదర భావంతో మెలగాలని కోరుకున్నారు.

స్కూటీ అదుపుతప్పి యువతి మృతి

- మృతురాలి నేత్రాలు సేకరించిన రెడ్‌క్రాస్



నేత్రాలను సేకరిస్తున్న టెక్నీషియన్ శ్రీను



నందిని (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: స్థానిక సీతం కాలేజీలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న యువతి స్కూటీ అదుపుతప్పి కింద పడిపోయి మృతిచెందింది. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గాజులరేగకు చెందిన బోనెల నందిని(18) శనివారం స్కూటీపై కాలేజీ నుంచి ఇంటికి వెళ్తుండగా అదుపుతప్పి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలపాలైంది. దీంతో కుటుంబసభ్యులు నందినిని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను తీసుకోవాలని రెడ్‌క్రాస్ సొసైటీ ఐ డొనేషన్ సెంటర్ సిబ్బందికి తెలియజేయడంతో టెక్నీషియన్ ఎ.శ్రీను కార్నియాలను సేకరించారు. తన కూతురు చనిపోయినా ఆమె కళ్లతో మరో ఇద్దరికి చూపును ప్రసాదించాలన్న ఉద్దేశంతో ఆమె నేత్రాలను సేకరించాలని రెడ్‌క్రాస్ సొసైటీ ఐ డొనేషన్ సెంటర్‌కు సమాచారం ఇచ్చామని మృతురాలి తండ్రి పైడిరాజు తెలిపారు.

ఆటల పండగపై అవగాహన

- సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్
- జిల్లావ్యాప్తంగా 5 క్రీడాంశాల్లో 1.38 లక్షల మంది పేర్ల నమోదు
- ఆడుదాం ఆంధ్రాపై జిల్లాకేంద్రంలో ఉత్సాహంగా 2కె రన్



రాజీవ్ క్రీడామైదానంలో జెండా ఊపి 2కె రన్‌ను ప్రారంభిస్తున్న సెట్విజ్ సీఈఓ రామగోపాల్, డీఎస్‌డీఓ అచ్యుతరావు

విజయనగరం: క్రీడల్లో ప్రతిభ గల వారిని గుర్తించి ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలను పండగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్ తెలిపారు. పోటీల నిర్వహణపై అన్ని వర్గాల ప్రజల్లో అవగాహన కల్పించడంలో భాగంగా విజయనగరం జిల్లా కేంద్రంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి అచ్యుత్‌కుమార్ ఆధ్వర్యంలో 2 కెరన్‌ను ఆదివారం నిర్వహించారు. నగరంలోని రాజీవ్ క్రీడామైదానం నుంచి ప్రారంభమైన రన్ కోట జంక్షన్ మీదుగా మళ్లీ రాజీవ్ క్రీడామైదానానికి చేరుకుంది. క్రీడాకారులు ఉత్సాహంగా రన్‌లో పాల్గొన్నారు. అనంతరం రన్‌లో విజేతలుగా నిలిచిన వారికి సెట్విజ్ సీఈఓ, డిఎస్‌డీఓలు బహుమతులు ప్రదానం చేశారు.



ర్యాలీలో పాల్గొన్న క్రీడాకారులు

ఐదు అంశాల్లో పోటీలు

ఈ సందర్భంగా సీఈఓ రామగోపాల్ మాట్లాడుతూ 15 సంవత్సరాలకు పైబడి వయస్సుండి క్రీడా ప్రతిభ కలిగిన వారిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తోందన్నారు. మొత్తం 5 అంశాల్లో నిర్వహించతలపెట్టిన పోటీల్లో ఇప్పటి వరకు విజయనగరం జిల్లాలో 1.38 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు వివరించారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల క్రీడాకారులు సమీపంలోని సచివాలయంలో, 1902 నంబర్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాంశాలతో పాటు యోగా, టెన్నికాయిట్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలను ఈనెల 26న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమరావతిలో ప్రారంభించనుండగా.. విజయనగరం జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడామైదానంలో ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తారన్నారు. ఆ రోజు నుంచి సచివాలయ స్థాయిలో పోటీల నిర్వహణకు సంబంధించి అవసరమైన మైదానాలు గుర్తించామని, పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అవసరమైన క్రీడాసామాగ్రి ఇప్పటికే పంపిణీ చేసినట్లు చెప్పారు.

విజేతలకు నగదు ప్రోత్సహకం

సచివాలయం, మండల స్థాయి పోటీల్లో విజేతలు నియోజకవర్గ స్థాయికి అర్హత సాధిస్తారని, నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులతో పాటు ట్రోఫీలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కాళ్ల సూరిబాబు, వివిధ క్రీడాంశాలకు చెందిన కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.